క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



చాట్రాయి: పౌష్టికాహార లోపాన్ని నివారిద్దామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ గాయత్రి అన్నారు. మండలంలోని పోలవరం గ్రామంలో చిన్నారుల తల్లిదండ్రులకు పౌష్టికాహార లోపంపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార లోపాన్ని నివారించడం వల్ల పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించవచ్చన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు శ్రీదేవి, పి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నవమి వేడుకలు

చాట్రాయి: చనుబండ గ్రామంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన కోదండ రామాలయంలో బుధవారంతో నవమి వేడుకలు ముగిశాయి. వేలాది మందిగా తరలి వచ్చిన మహిళలు పూజల అనంతరం రాత్రి 11 గంటలకు స్వామి వార్లకు పవళింపు సేవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

యోగాతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం



ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించవచ్చని ఎన్టీటీపీఎస్ ఎస్ఈ వై.ఉమామహేశ్వరరావు అన్నారు. ఎస్‌వీసీటీ ఆధ్వర్యంలో సీకాలనీ ఆడిటోరియంలో ఉచిత యోగా శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యోగా సాధనతో శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయన్నారు. జీవన క్రియలు సజావుగా జరుగుతాయని చెప్పారు. యోగా గురువు లంకే జనార్దన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో నేడు యోగాను ఆచరిస్తున్నారన్నారు. అనంతరం సాధకులతో సూక్ష్మ వ్యాయామాలు, యోగా, ప్రాణాయామం, ధ్యాన సాధన చేయించారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



ఇబ్రహీంపట్నం: కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ కార్యక్రమం ఇబ్రహీంపట్నం క్లస్టర్ కార్యాలయం వద్ద బుధవారం జరిగింది. మైలవరం క్లస్టర్ పరిధిలోని 20 పాల సంఘాలకు 2024-25 ఏడాదికి గాను మూడో విడత నాలుగు నెలల బోనస్ రూ.31,89,709 నగదు చెక్కును క్లస్టర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి లబ్ధిదారులకు అందజేశారు. క్లస్టర్ పరిధిలోని పాల సేకరణ కేంద్రం సభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పూడికతీత

నూజివీడు: పట్టణంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డ్రెయినేజీల్లో పూడికతీత పనులను బుధవారం శరవేగంగా చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు హనుమాన్ జంక్షన్ రోడ్డులోని డ్రెయినేజీలో పూడికతీతను మున్సిపాలిటీ సిబ్బంది జేసీబీతో చేపట్టారు. డ్రెయినేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తూ, చెత్త, చెదారాన్ని ట్రాక్టర్లలో వేసి పట్టణ శివార్లలోకి తరలించారు. పూడికతీత పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పర్యవేక్షించారు. అన్ని ప్రధాన రహదారుల్లో పూడికతీత పనులు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

పన్ను చెల్లింపుపై రాయితీ

తిరువూరు: 2025-26 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలపై పన్ను ఏకమొత్తంలో చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తామని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు తెలిపారు. ఈ నెల 30లోగా పన్ను చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్యాపకులకు అవార్డులు

తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు ఇద్దరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ప్రతి ఏటా ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి జ్ఞాపిక, అవార్డులతో ప్రోత్సహిస్తోందని చెప్పారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ అవార్డులను గుంటూరులో ప్రదానం చేస్తారన్నారు.

ఐదు లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: మండలంలోని సి.గుడిపాడు గ్రామంలో బుధవారం దాడులు చేశామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్‌సింగ్ తెలిపారు. సారా అమ్ముతున్న కటారి జయరాజుని అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఖాళీ స్థలం.. కనిపిస్తే కబ్జా

- నూజివీడులో అడుగడుగునా ఆక్రమణలు
- కుంచించుకుపోతున్న రహదారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

నూజివీడు: నూజివీడు పట్టణంలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. అరికట్టాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా రహదారులు కుంచించుకుపోతున్నాయి. పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డు, బస్టాండు రోడ్డు, వెంకటేశ్వరస్వామి కోవెల రోడ్డు, మున్సిపల్ కార్యాలయ కూడలి, మైలవరం రోడ్డు, విస్సన్నపేట రోడ్డు తదితర చోట్ల ఆక్రమణలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి.



అర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద మార్జిన్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన పూల మొక్కల నర్సరీ



హనుమాన్ జంక్షన్ రోడ్డులో బాలికల హైస్కూల్ ఎదురుగా మార్జిన్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

ఆక్రమణల పర్వంలో చిరు వ్యాపారులు

దుకాణాల వ్యాపారులు తమ దుకాణాలను దాటి మార్జిన్లను, డ్రెయినేజీలను ఆక్రమిస్తున్నారు. కొబ్బరి బొండాల వ్యాపారులు, టీ స్టాల్స్, సిగరెట్ బడ్డీలు, మొబైల్ క్యాంటీన్లు, ఫ్రైడ్ రైస్ పాయింట్లు, పానీపూరి బండ్లు, హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, ఫర్నిచర్ షాపులు, బైక్ మెకానిక్ షాపులు, జ్యూస్ పాయింట్ల వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా ఆక్రమించేస్తున్నారు. కొందరైతే ఏకంగా రోడ్డు మార్జిన్లలో దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి తోడు ఆటోల స్టాండ్ పేరుతో ఆటోవాలాలు రోడ్డు మార్జిన్లను పూర్తిగా ఆక్రమించేసి పందిళ్లు వేస్తున్నారు.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

బస్టాండు వద్ద వ్యాన్‌లను రోడ్డుపైనే నిలుపుతుండటంతో ఎదురెదురుగా బస్సులు, కార్లు వస్తే తప్పుకునేందుకు వీలు పడటం లేదు. 50 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన రోడ్డు మరింత కుంచించుకుపోయి ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమవుతోంది. మైలవరం రోడ్డులో ఉన్న పేతురు వాగు పూర్తిగా ఆక్రమణకు గురైంది. 20 అడుగులు ఉండాల్సిన వాగు ప్రస్తుతం నాలుగడుగులకు మాత్రమే పరిమితమైంది. నెర్రూరా పేట వైపు నుంచి బస్టాండు వైపు వచ్చే వాగు పూర్తిగా ఆక్రమణలకు గురై భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల అయితే వాగును ఆక్రమించి బిల్డింగులు నిర్మించేశారు.

మెట్లు, ర్యాంపులతో మరింత ఇబ్బంది

ప్రధాన రహదారుల పరిస్థితి ఇలా ఉండగా పలు కాలనీల్లో రహదారులపైకి మెట్లు కడుతూ, ర్యాంపులు నిర్మిస్తూ 40 అడుగుల వరకు ఉండాల్సిన రహదారిని 10 అడుగులకు తీసుకొస్తున్నారు. దీంతో కార్లు ఎదురైనా తప్పుకునేందుకు వీలులేని పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డు మార్జిన్లను ఆక్రమించేసి కార్లు పెట్టుకునేందుకు షెడ్లను నిర్మించడం, పూల మొక్కలు వేసుకోవడానికి ఐరన్ ఫెన్సింగ్ వేయడం వంటివి చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టణంలో ఆక్రమణలను తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలని పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

మార్జిన్లలో ఆక్రమణలను తొలగించాలి



పట్టణంలోని రోడ్డు మార్జిన్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు పెరగడంతో పాటు షాపులకు వచ్చిన వారు తమ ద్విచక్ర వాహనాలను పెట్టుకునేందుకు కూడా ఖాళీ ఉండటం లేదు. అసలే ఇరుకుగా ఉన్న రహదారులు మరింత ఇరుకవుతున్నాయి. అధికారులు దీనిపై దృష్టి పెట్టాలి.
–షేక్ మస్తాన్ వలి, నూజివీడు

ఇరుకుగా మారిన రహదారులు



పట్టణంలోని తారు రోడ్లు 50 ఏళ్ల కిందట పంచాయతీ కాలం నాటివి. అసలే రోడ్లు ఇరుకుగా ఉండి ఇబ్బంది పడుతుంటే మార్జిన్లను ఆక్రమించుకోవడంతో మరింత కుంచించుకుపోతున్నాయి. ఆక్రమణలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.
–పరిమి సాగర్‌కుమార్, నూజివీడు

ఆక్రమణలను గుర్తించి నోటీసులు ఇస్తాం



పట్టణంలోని ఆక్రమణలను గుర్తించి నోటీసులు ఇస్తాం. సిబ్బందిని పంపించి ఆక్రమణను తొలగించమని చెప్పిస్తాం. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడతాం.
–ఆర్.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, నూజివీడు

ఈదురు గాలులకు నేలవాలిన మునగ

రైతులకు తీవ్ర నష్టం

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలో రెండు రోజుల కిందట వీచిన ఈదురు గాలులతో ఉద్యాన పంటలైన మునగ తోటలు నేలవాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని కేతనకొండ, మూలపాడు, కొటికలపూడి, జూపూడి గ్రామాల్లో సుమారు 15 ఎకరాల్లో రైతులు మునగసాగు చేపట్టారు. ఏడు నెలలుగా మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాపు దశలో ఉన్న సమయంలో అకాల వర్షం, ఈదురు గాలులతో మొక్కలు విరిగిపోగా, మరి కొన్ని మొక్కలు పూర్తిగా వంగిపోయి నేలవాలాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు దెబ్బతిన్న మునగ తోటలను పరిశీలించారు. మునగ మొక్కలు వేర్లతో సహా బయటకు పీక్కొస్తేనే ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని అధికారులు చెబుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఎకరాకు రూ. 30 వేల పెట్టుబడి

ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతకుముందు వరద ప్రభావంతో మునగ పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ఏడాదిలో రెండు సార్లు సాగు చేయడంతో రైతులు అధికంగా ఖర్చులు భరించాల్సి వచ్చింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని మునగ రైతులు కోరుతున్నారు.



జూపూడి లంక భూముల్లో ఈదురు గాలులకు నేలవాలిన మునగ మొక్కలు



కొటికలపూడిలో గాలులకు విరిగిపోయిన మునగ మొక్కలు

అధికారుల తీరుపై ఆగ్రహం

- బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్న సభ్యులు
- మండల పరిషత్ సమావేశంలో వాడీవేడిగా చర్చ

ముసునూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పలువురు సభ్యులు పేర్కొన్నారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ దుర్గాభవాని, వైస్ ఎంపీపీలు రాజా నాయన, గంగాధర్, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సర్వసభ్య సమావేశాల్లో తీర్మానించిన అంశాలను, పనులను నెరవేర్చకపోగా వాటిని గురించి వివరణ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలకు, కార్యక్రమాలకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించడం లేదన్నారు. సర్పంచ్‌లను గ్రామసభలకు ఆహ్వానించకుండా కార్యక్రమాలను నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. గత మూడు సర్వసభ్య సమావేశాల్లో నూజివీడు నుంచి చింతలవల్లి, లోపూడి, యడవల్లి, ఎర్రంపల్లి మీదుగా షార్ట్‌కట్ రూట్‌లలో చింతలపూడికి సర్వీసులు కావాలని తీర్మానం చేసినా చర్యలు చేపట్టలేదని ఆగ్రహించారు. అనంతరం అధికారులు తమ తమ శాఖల పనితీరు, ప్రణాళికలను వివరించారు. వ్యవసాయాధికారి చినసూరిబాబు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులకు ఉపకరించే కేంద్ర ప్రభుత్వ రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. జల్ జీవన్ పథకం ద్వారా తాగునీటి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ జి. రాణి, మాజీ ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంఈఓ సుబ్బారావు, పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్, ఆర్టీసీ ప్రతినిధి కేఆర్‌కే, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని

ఇంధనం ధరల పెంపుపై నిరసన

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఇంధనం ధరల పెంపుపై ఇబ్రహీంపట్నంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు మహేష్ మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్, ఇంటి పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూలిగే నక్కపై తాడికాయ పడిన చందంగా గ్యాస్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2 పెంచి పేదలపై అధిక భారం మోపిందన్నారు. ఎన్నికల ముందు వరాల జల్లు కురిపించిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక ధరల భారం మోపడం సిగ్గుచేటన్నారు. ఇంధనం ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పట్టణ కమిటీ సభ్యులు అలేటి విఠల్‌రావు, కొండలరావు, పార్వతి, బేబీ, రమణమ్మ, లైలా కుమారి పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై పెంచిన రూ.50 వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నండూరి రామ హనుమాన్ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజల నెత్తిన భారాలు మోపుతోందని, సంపన్నులకు దోచిపెడుతోందని విమర్శించారు. ప్రపంచ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర పడిపోయినందున వెంటనే పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు, నాయకులు పి.శోభనాద్రి, కె.శీను, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



నూజివీడులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

13న గురుకుల ప్రవేశ పరీక్ష

తిరువూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరదలచిన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఈ నెల 13న నిర్వహిస్తామని తిరువూరు గురుకుల ప్రిన్సిపాల్ కోటిరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని ఏదైనా గుర్తింపు కార్డుతో పరీక్షా కేంద్రానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

- మైలవరం: గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని కుంటముక్కల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కనపర్తి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు, ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన నేతను శిక్షించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

విస్సన్నపేట: సత్తెనపల్లి నియోజకవర్గంలోని కంకణాలపల్లిలో దళిత అంగన్‌వాడీ కార్యకర్తను ఫోన్‌లో దూషించి, వేధింపులకు పాల్పడిన తెలుగుదేశం నాయకుడిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం విస్సన్నపేట అంబేడ్కర్ సెంటర్లో ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీ కల్యాణికి వినతిపత్రం అందజేశారు. ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ టీడీపీ నేతపై కుల దూషణ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముంగా జయరాజు, లాజరస్, లక్ష్మయ్య, సిరసాని ప్రకాష్, జయకర్, జ్ఞానరత్నం, నాగరాజు, భాస్కరరావు, మల్లయ్య, తిరుపతిరావు, బాజీ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై సమావేశం

తిరువూరు: రానున్న ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు తిరువూరు మండల స్థాయి అధికారుల సమావేశం బుధవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. పంటల సాగుకు ముందే మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు చేసిన అనంతరం ఆయా భూసారాన్ని అనుసరించి పంటల సాగు నిర్ధారణ, విత్తన ఎంపిక తదితర అంశాలపై వెలుగు, ప్రకృతి సేద్యం, వ్యవసాయ సిబ్బందితో వ్యవసాయాధికారి పద్మ సమావేశం నిర్వహించారు.

ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓగా మాధవరెడ్డి



తిరువూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తిరువూరు మండల అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారిగా ఎం. మాధవరెడ్డి నియమితులయ్యారు. ఇబ్రహీంపట్నం నుంచి తిరువూరుకు ఆయన బదిలీపై రాగా, తిరువూరులో పనిచేస్తున్న నల్లగట్ల మున్నీ ఇబ్రహీంపట్నం బదిలీ అయ్యారు. బుధవారం మాధవరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

ప్రజా సమస్యలపై పోరాటం

మాజీ మంత్రి జోగి రమేష్

ఇబ్రహీంపట్నం: ప్రజల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పచ్చిగోళ్ల వెంకటరత్నరాజు (పండు) పార్టీ నాయకులతో కలిసి జోగి రమేష్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జోగి రమేష్, జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జోగి రమేష్ మాట్లాడుతూ పదవుల్లో నియమితులైన వారు గ్రామాల్లో నిబద్ధతతో పనిచేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. త్వరలో ఇబ్రహీంపట్నం, కొండపల్లి మున్సిపాల్టీ కమిటీలు నియమిస్తామని చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. పచ్చిగోళ్ల పండుని శాలువాతో సత్కరించారు. సీనియర్ నాయకులు మేడపాటి నాగిరెడ్డి, మిక్కిలి శరభయ్య, పోరంకి శ్రీనివాస రాజు, రెంటపల్లి నాగరాజు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పచ్చిగోళ్ల పండుని అభినందిస్తున్న జోగి రమేష్

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ

నూజివీడు: సీఎం చంద్రబాబు పర్యటనను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. నూజివీడులోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రాత్రి అన్ని శాఖల జిల్లా అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11న సీఎం ఆగిరిపల్లి మండలం వడ్లమాను విచ్చేస్తారని, అనంతరం కుల వృత్తులకు సంబంధించిన కుటుంబాలను వారి పని ప్రదేశంలో కలిసి వారి సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. అనంతరం ప్రజావేదికకు చేరుకొని ప్రసంగిస్తారన్నారు. తదుపరి పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అనంతరం తిరిగి విజయవాడ వెళ్తారన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా సీఎం పర్యటన కార్యక్రమానికి విచ్చేసే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశాన్ని గుర్తించి, ఆగిరిపల్లి గ్రామంలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్, సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్, ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ కృష్ణారావు, ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

చండ్ర రాజేశ్వరరావుకు నివాళి

నూజివీడు: సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం బుధవారం పట్టణంలోని అమర్ భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం దేశవ్యాప్తంగా సాగిన పోరాటాలకు నాయకత్వం వహించిన చండ్ర రాజేశ్వరరావు ఆశయాలను, పోరాటాలను నేటి కమ్యూనిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. చల్లపల్లి జమిందార్‌కు వ్యతిరేకంగా భూ పోరాటం చేసి వేలాది ఎకరాలు పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి చండ్ర రాజేశ్వరరావు అని కొనియాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు పాల్గొన్నారు.



చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రోడ్లపై దమ్ము చక్రాలతో రాకపోకలు వద్దు

మైలవరం: మైలవరం డివిజన్ పరిధిలోని ఆర్ అండ్ బీ రహదారుల్లో దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రాకపోకలు సాగించవద్దని ఆర్ అండ్ బీ కార్యనిర్వాహక ఇంజినీర్ జి. ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పట్టాలు పెట్టుకుని వెళ్లాలని ఆయన సూచించారు.

12 నుంచి మారెమ్మ తల్లి తిరునాళ్ల

విస్సన్నపేట: పుట్రేల మారెమ్మ తల్లి తిరునాళ్ల ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తామని ఆలయ ఈఓ వి. దుర్గా ధనప్రసాద్ తెలిపారు. 13న అమ్మవారి గ్రామోత్సవం, రథోత్సవం, అన్నసమారాధన జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

జీవనోపాధి అవకాశాలపై సర్వే



మైలవరం: మైలవరం మండలంలోని డ్వాక్రా గ్రూపు సభ్యులకు జీవనోపాధి అవకాశాలు కల్పించే నిమిత్తం యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నామని వెలుగు ఏపీఎం ఎన్. శామ్యూల్ అన్నారు. మైలవరం వెలుగు కార్యాలయంలో గ్రూపుల సభ్యులకు అవగాహనన సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రూపు సభ్యుల జీవనోపాధికి ఎంత మొత్తంలో నిధులు కావాలి, ఏ నెలలో కావాలి తదితర సమాచారాన్ని యాప్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రూపు సభ్యులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రూపు లీడర్లు, గ్రూపుల సభ్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల చట్ట సవరణ తగదు



తిరువూరు: వక్ఫ్ ఆస్తుల చట్ట సవరణతో మైనార్టీల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. తిరువూరు పాత బస్టాండు సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలతో దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందన్నారు. వక్ఫ్ ఆస్తుల చట్ట సవరణను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సుబానీ పాల్గొన్నారు.